
www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 21 జనవరి 2025 | 5 | కాకినాడ



ఎస్‌పిగా బిందు మాధవ్



ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా ఎస్‌పిగా జి.బిందు మాధవ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటి వరకూ ఎస్‌పిగా విధులు నిర్వర్తించిన విక్రాంత్ పాటిల్ కర్నూలుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన ఎస్‌పిగా బిందు మాధవ్ నియమితులు కావటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఐపిఎస్ అధికారుల సాధారణ బదిలీల్లో భాగంగా రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త ఎస్‌పి త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నారు.

టెక్నాలజీతో శాంతిభద్రతల పరిరక్షణ

డిజిపి ద్వారక తిరుమలరావు

ప్రజాశక్తి - కాకినాడ, కాకినాడ రూరల్

రాష్ట్రంలో టెక్నాలజీతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నామని డిజిపి ద్వారక తిరుమల రావు అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడెనిమిది నెలలుగా రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడడంలో గాని, నేరాలను నిరోధించడంలో గాని అత్యంత సైంటిఫిక్, ప్రొఫెషనల్‌గా వ్యవహరించడం జరుగుతుందన్నారు. టెక్నాలజీని అప్‌డేట్ చేసుకుని గత మూడు నాలుగు సంవత్సరాల్లో కంటే జరిగిన నేరాలను కూడా డిటెక్ట్ చేస్తున్నామని అన్నారు. అవసరమైన మౌళిక వసతులను అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. ఇప్పటివరకు ఎక్కువగా వాడుకలో లేని డ్రోన్స్‌ను వాడుకోవడం జరుగుతుందని, వార్నింగ్ మెయింటెనెన్స్ లేకపోవడం వల్ల పనిచేయని సిసి కెమెరాలను కూడా పునరుద్ధరించడం జరిగిందన్నారు. ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం కూడా దేశంలోనే ఎవిధంగా అత్యంత ఆధునికంగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్ ఇన్విజిబుల్ పోలీస్ అనే స్లోగన్‌ను కింది స్థాయి సిబ్బంది వరకు తీసుకువెళ్లడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఇటీవల కాలంలో చాలామంది ప్రజలు సైబర్ నేరాల బారినపడి ఆర్థికంగా నష్టపోవడం జరుగుతుండడం తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు, డిజిటల్ అరెస్ట్, జాబ్ రాకెట్లు తదితర సైబర్ నేరాల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని వివరించారు. టెక్నాలజీని వాడడం వల్ల ఇటీవల సైబర్ నేరాలు తగ్గయన్నారు. చాలా చోట్ల బ్యాంకు మేనేజర్లను పిలిపించి అధిక మొత్తంలో నగదు బదిలీ జరిగే సమయంలో సంబంధిత ఖాతాదారుడికి ఫోన్ చేసి ఏదైనా భయం ద్వారా నగదును బదిలీ చేస్తున్నారా లేక స్వయంగా బదిలీ చేస్తున్నారా అని ప్రశ్నించాలని సూచించడం జరిగిందన్నారు. బ్యాంకు మేనేజర్లు ఆ విధంగా ఖాతాదారులను ప్రశ్నిస్తు ఉండటం వల్ల సైబర్ నేరాలు అదుపులోకి వస్తున్నాయన్నారు. సైబర్ నేరాల అదుపులో భాగంగా ప్రతి జిల్లాలో ఒక సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశామని తెలిపారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఏజెన్సీ టూర్‌లో ఎటువంటి భద్రత లోపం జరగలేదని, పవన్ ఇంటిపై డ్రోన్ ఎగిరిందా లేదా అనేది క్లారిటీ లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఆయన భద్రతపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్‌పి కృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిజిపి తిరుమలరావు

ఎపిఎస్‌పి బెటాలియన్ సందర్శన

కాకినాడ రూరల్ మండలంలో ఉన్న 3వ ఎపిఎస్‌పి బెటాలియన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ దీపిక ఆయనకు పోలీస్ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం బెటాలియన్‌లోని పలు విభాగాలను సందర్శించారు. పాఠశాల ఆవరణలో పునరుద్ధరించబడిన సైన్స్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. జాతీయ స్థాయిలో ఎన్‌సిసి క్యాంప్ చేసి పతకాలు సాధించిన క్యాడెట్స్‌ను, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్.సుస్మిత, ఎస్‌పి విక్రాంత్‌పాటిల్, ఎపిఎస్‌పి అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు మన్మధరావు, చంద్రశేఖర్, స్కూల్ ప్రిన్సిపల్ కె.రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కాకినాడ డిపోను రాష్ట్ర డిజిపి, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండి ద్వారక తిరుమలరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డిపో పరిసరాలను పరిశీలించి గ్యారేజ్‌లో ఏర్పాటు చేసిన సిబ్బంది యొక్క సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్ ఎస్‌జె.రావు, వివిఎస్.మూర్తికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గొల్ల విజయరత్నం, జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ ఎంఎవి.మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ప్రభాకరరావు, డిటిఐలు ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌కెఎం.భాష, పిఆర్‌ఒ సిహెచ్.వెంకట్ రాజు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సహకార సంఘ ఉద్యోగులు

సహకార ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఎపి సహకార ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె. ఆదినారాయణ మాట్లాడుతూ జిఒ నెంబర్ 36 ప్రకారం వేతన సవరణ వెంటనే చేయాలని, ఉద్యోగుల వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. 2019 తరువాత నియమించిన ఉద్యోగులను కొనసాగించాలని, వారికి మెడికల్ ఇన్స్యూరెన్స్ వర్తింప చేయాలని, గ్రాట్యుటీని చట్టప్రకారం చెల్లించాలని, కంప్యూటరీకరణలో ఇబ్బందులు, పనివత్తిడి తగ్గించాలని, డిఎల్‌ఎస్‌ఎఫ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా ఆందోళన చేపట్టామన్నారు. ఫిబ్రవరి 27న రాష్ట్ర ఆప్కోబ్ కార్యాలయం వద్ద ధర్నాకు సిద్ధం అవుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్ల పై సానుకూలంగా స్పందించని పక్షంలో ఫిబ్రవరి 1 నుంచి సమ్మెకు సన్నాహాలు చేస్తున్నామని, జరగబోవు పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కె.సత్తిరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. సహకార రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఉద్యమాల ద్వారా పాలకులను మేల్కొలిపి డిమాండ్స్ సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఐక్య ఉద్యమాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సహకార ఉద్యోగుల పోరాటం రాబోయే రోజుల్లో కార్మికుల పోరాటాలకు మార్గం చూపాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.కలెక్టర్ కార్యాలయం మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.నరసరాజు, జి. అప్పలరాజు, ఎం.శివనాగ, ఎఎస్ఎన్.రెడ్డి, పి.తమ్మయ్య, బి.రాము, వీరభద్రరావు, రామన్న, శాంతి, సత్య, పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలు ప్రారంభం

ప్రజాశక్తి - యంత్రాంగం

పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలో పశు వైద్య శిబిరాలు ప్రారంభం అయ్యాయి. కరప మండలంలోని గొర్రిపూడి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంఎల్‌ఎ పంతం నానాజీ ప్రారంభించారు. ఎడిఎ డాక్టర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. విజేతలకు ఎంఎల్‌ఎ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రైతులకు కూటమి ప్రభుత్వం అండదండగా ఉంటుందన్నారు. పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బండారు మురళి, గండి వెంకటేశ్వరరావు, అనుకూల రాంబాబు, దూడల నారాయణ, సైన్ వరకు భవాని శంకర్, ఓలేటి సూర్యనారాయణ పాల్గొన్నారు. **గండేపల్లి** గండేపల్లి గ్రామంలో జరిగిన పశు వైద్య శిబిరంలో పశు వైద్యాధికారి సుప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. **పెద్దాపురం** మండలంలోని కాండ్రకోట గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తుమ్మల రామస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువుల ఆరోగ్య పరిరక్షణ ద్వారానే అధిక పాల దిగుబడి సాధించవచ్చన్నారు. ఈ శిబిరంలో పశు వైద్యాధికారులు డాక్టర్ గంగాభవాని, డాక్టర్ మస్తాన్ బి, సిబ్బంది పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. **తాళ్లరేవు** మండలంలోని నీలపల్లి పంచాయతీ నేరేళ్ళంకలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఎడి బ్రహ్మవేద పాల్గొన్నారు. మండల పశువైద్యాధికారి డి.సుధ ఆధ్వర్యంలో పశువులకు ఆరోగ్య టీకాలను చేశారు. వివిధ రకాల పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చిట్టూరి కలికిమూర్తి, ఉప సర్పంచ్ వస్కా రెడ్డి, ఎంపిటిసి సభ్యులు దంగేటి సూరిబాబు పాల్గొన్నారు.



కరపలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ పంతం నానాజీ

యూనివర్సల్ బయో ఫ్యూయల్ మూసివేతకు ఆదేశం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ రూరల్ మండలం వాకలపూడి గ్రామంలో ఉన్న యూనివర్సల్ బయో ఫ్యూయల్ పివిటి లిమిటెడ్ కంపెనీని మూసివేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశాలు జారీ చేశారు. కంపెనీ నుంచి వెలువడే కాలుష్యంపై వచ్చిన ఫిర్యాదుతో ఎపిఐఐసి, ఐడిఎ వాకలపూడి బోర్డు అఫీషియల్‌తో ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ కమిటీ డిసెంబర్ 20, 21వ తేదీల్లో పర్యటించి కంపెనీని తనిఖీ చేయగా అనుమతి లేని ముడి పదార్థాలు, జంతువుల కొవ్వును వినియోగిస్తున్నట్లు గుర్తించారని, తద్వారా పొల్యూషన్ సమీప ప్రాంతాలకు దుర్వాసన వస్తుందని గుర్తించి నోటీసు జారి చేయడం జరిగిందన్నారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిర్ణయం మేరకు సదరు యూనివర్సల్ బయో ఫ్యూయల్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీని క్లోజ్ చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఎలక్ట్రీషియన్ డేను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 27వ తేదీన జరిగే ఎలక్ట్రీషియన్ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో యూనియన్ అధ్యక్షులు తాడిశెట్టి గంగ అధ్యక్షతన ఎలక్ట్రీషియన్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థామస్ హల్వా ఎడిషన్ ఎలక్ట్రిక్ బల్బును కనిపెట్టటం ద్వారా ప్రపంచమంతా వెలుగులు నింపారన్నారు. ఆయన విద్యుత్ బల్బు కనిపెట్టడం వల్ల ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమందికి ఉపాధి లభించిందన్నారు. అందుకే ఆయన పుట్టిన రోజును ఎలక్ట్రీషియన్ డేగా జరుపుకుంటున్నారన్నారు. ఆ రోజు జరిగే వేడుకల్లో ఎలక్ట్రీషియన్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పిదిరెడ్ల విష్ణు, కందిరెల్ల దుర్గాప్రసాద్, షేక్ ఇబ్రహీం, భూసారి శ్రీను, షేక్ బాషా, కాకి దుర్గ, దివిలి శ్యామలరావు, బి.సత్యనారాయణ, కోనాల రాజు, లంక చంటి, మదిని దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత: కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అధికారులతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో అందిన వినతులు ఎప్పటికప్పుడు పురస్కారించాలని అధికారులను ఆదేశించారు. ఈ వినతులకు అధిక ప్రాధాన్య తనిచ్చి సానుకూల దృక్పథంతో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలన్నారు. అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పింఛన్లు, బియ్యం కార్డు మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్లో నమోదు, ఆక్రమణలు తొలిగింపు, సిసి రోడ్లు, డ్రెయిన్లు, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, సదరం సర్టిఫికేట్ మంజూరు వంటి అంశాలకు సంబంధించి మొత్తం– 370 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్‌ఒ జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వివి. సత్యనారాయణ, జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, కెఎస్‌ఇజెడ్ ఎస్‌డిసి కెవి.రామలక్ష్మి, సిపిఒ పి.త్రినాథ్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కుష్టు నిర్మూలనకు ఇంటింటా సర్వే

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని తాటిపర్తి, చిన జగ్గంపేట, వన్నెపూడి, కొడవలి గ్రామాల్లో సోమవారం జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టారు. కుష్టి వ్యాధి నిర్మూలన దిశగా కుష్టు వ్యాధి లక్షణాలను కనుగొనడానికి ఇంటింటా సర్వే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. చర్మంపై స్పష్టమైన నొప్పి లేదా దురద లేని మచ్చలు చర్మంపై ఎర్రని లేదా రాగి రంగు మచ్చలు, కనురెప్ప పూర్తిగా మూయలేకపోవడం, చేతులు పాదాలు నరాలయందు తిమ్మిర్లు ఉండడం, అరచేతులు, కాళ్లు పాదాలు స్పర్శ లేకపోవడం, కాళ్ల నుంచి చెప్పులు జారిపోవడం వంటివి కుష్టి వ్యాధి లక్షణాలని అన్నారు. అలావున్నట్లు అయితే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదిం చాలని పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సునీత మెర్సి తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి పర్యవేక్షకులు గుంటక శ్రీనివాసరావు, అహ్మద్ బాషా, ఎఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - సామర్లకోట

బంపర్ ఆఫర్ల పేరుతో ప్రజలను మోసంచేసే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఐ ఎ.కృష్ణభగవాన్ సూచించారు. సోమవారం స్థానిక ఆర్‌టిసి బస్‌స్టాండ్ వద్ద సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్ట్ టైం జాబ్, ఆఫర్లు, బంపర్ బహుమతులు వంటి వ్యవహారాల పేరుతో నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. అలాంటి వారినుంచి యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని నెంబర్‌ల నుంచి ఇలాంటి ఫోన్లు వచ్చినా కంగారు పడకుండా ఉండాలన్నారు. అవసరం అయితే పోలీసుల సహకారం పొందాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలకు సంబంధించి అవగాహన స్టికర్‌లను జన సమూహాలు ఉండే ప్రాంతాల్లో అతికించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గరగారావు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న సిఐ కృష్ణభగవాన్

సకాలంలో చెత్త సేకరణ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

పారిశుధ్య నిర్వహణ విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని, సకాలంలో చెత్త సేకరణ పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. పారిశుధ్య తనిఖీల్లో భాగంగా సోమవారం కమిషనర్ భావన నగరంలోని రామారావు పేట, మూడు లైట్ల జంక్షన్, భానుగుడి జంక్షన్, చార్మినార్ టీ సెంటర్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరణ జరుగుతున్న తీరును గమనించారు. చెత్త సేకరణ ఎలా జరుగుతున్నదీ అక్కడ ఉన్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా తీసుకుంటున్నారా? అని ఆరా తీశారు. అపార్టుమెంట్లు నుంచి చెత్త సేకరణ గురించి ప్రశ్నించారు. చెత్త సేకరణ వాహనాల రాకపోకల సమయాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ప్రదర్శించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నగర ప్రజలు నగరాన్ని క్లీన్ సిటీగా ఉంచేందుకు సహకరించాలని, పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఒ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ భావన

తప్పిన ఘోర ప్రమాదం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళుతున్న లోటస్ ట్రావెల్ బస్ టైర్ పేలడంతో ప్రత్తిపాడులో పాదాలమ్మ తల్లి గుడి సమీపంలో అదుపు తప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. సుమారు 47 మంది ప్రయాణికులతో ప్రయాణిస్తున్న బస్ టైర్ పేలడంతో డివైడర్ పై నుంచి పక్క రోడ్ మీదుగా రైలింగ్‌ను ఢీకొట్టి పంట పొలాల్లోకి దూసుకుపోయింది. ప్రయాణికులు అంతా సురక్షితంగా బయటపడ్డారు.



పొలంలోకి దూసుకుపోయిన ప్రయివేటు బస్సు

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి


ప్రజాశక్తి - శంఖవరం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి నాయకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు కోరారు. సోమ వారం మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్ళు కోల్పోయిన బాధితులు అడ్డాల నూకరాజు, అడ్డాల రాజబాబులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా నూకరాజు కుటుంబానికి రూ.5 వేలు, రాజబాబు కుటుంబానికి రూ.2,500 నగదు సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈగ విజయదుర్గ, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ముదునూరి

కార్టూ'నిజం'



పాత పద్ధతిలో పెన్ను, పేపర్‌తో 'నీట్ 'పరీక్ష

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో రూ.80 లక్షలతో నిర్మించే సిసి రోడ్ల నిర్మాణాలకు ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి శంకుస్థాపన చేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నా యని అన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు చెప్పారు. వైసిసి పాలనలో రోడ్లు, డ్రెయిన్‌ల ఆధునీకరణ పనులను పట్టించుకోలేదన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలను చేపడుతుందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులన్నింటినీ పూర్తి నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కూటమి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీశ్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, వల్లూరి దొరబాబు, నిమ్మకాయల కిరణ్, పాగా సురేష్ కుమార్, లాయర్ శ్రీను, బలుసు వాసు, సరోజ వాసు, పిట్టా జానకి రామారావు, మంచెం సాయిబాబు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సిసి రోడ్లు నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప



అవార్డు అందుకుంటున్న చక్రపాణి

చిత్రకళాకారుడు చక్రపాణికి అవార్డు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరానికి చెందిన ప్రముఖ చిత్రకళాకారుడు తూమురౌతు చక్రపాణి ఆర్ట్ లెజెండ్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును అమలాపురంలో జరిగిన 35వ అంతర్జాతీయ కోనసీమ చిత్రకళా పరిషత్ బ్రహ్మోత్సవాల్లో ఆయన అంతర్జాతీయ శిల్పి రాజ్‌కుమార్ వడియార్ చేతుల మీదుగా అందుకున్నారు. చిత్రలేఖనంలో ఫణికుమార్ కనపరచిన ప్రతిభను పలువురు ప్రశంసించారు. ఫణి కుమార్ చిత్రలేఖనంలో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకుని ప్రపంచ చిత్రకారుడిగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఏలేశ్వరం పట్టణ ప్రజలు పలువురు చక్రపాణినకి అభినందనలు తెలిపారు.

వీవర్స్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. స్థానిక ముప్పన రామారావు కమ్యూనిటీ హాలులో ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, కమ్యూనిటీ హాలు ప్రెసిడెంట్ జెట్టి రాజబ్బాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు విశ్వనాథం సత్యపరదేశి మాట్లాడారు. చేనేత పరిశ్రమపై ఆధారపడి రాష్ట్రవ్యాప్తంగా 18 కులాలవారు జీవిస్తున్నారన్నారు. వీరి జీవనాధారమైన చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉన్నందున ఈ పరిశ్రమ పరిరక్షణకు వీవర్స్ ఫెడరేషన్ కృషి చేస్తుందన్నారు. చేనేత పరిరక్షణకు అందరూ ఐక్యంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కట్టా రాజబాబు, పున్నపు జగన్నాథరావు, జల్దాని సుబ్రహ్మణ్యం, వరదా కోటేశ్వరరావు, చల్లా జయశ్రీ, దొడ్డిపట్ల రాజు, బొప్పే సత్యనారాయణ, చల్లా రామకృష్ణ, దోర నాగేశ్వరరావు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘీయులు

నేరాలు ఘోరాలు

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

వివాహిత అనుమానాస్పదంగా మతి చెందిన సంఘటన సోమవారం మూలపేట గ్రామంలో చోటు చేసుకుంది. కావాలనే తన కూతుర్ని చంపేశారని కొత్తపల్లి పోలీసులకు తల్లి గింజల లక్ష్మి ఫిర్యాదు చేసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. మూలపేట గ్రామం ప్రకాష్ నగర్‌కు చెందిన గింజల బాల (25) అదే గ్రామానికి చెందిన రాచపల్లి ప్రసాద్ 8 ఏళ్ల క్రితం ప్రేమించి ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే ఇటీవల కాలంలో భర్త రాచపల్లి ప్రసాద్ వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరిగుతున్నాయి. కావాలనే తన కూతురిని అత్తంటివారు సోమవారం ఉరివేసి చంపేసి వెంటనే ఆమె మృతదేహానికి ఖననం చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. అయితే ఈ విషయాన్ని తారుమారు చేసేందుకు పలు ప్రయోగాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చిందని మృతురాల తల్లి ఆవేదన వ్యక్తం చేసింది.

1,600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేటలో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సిఐ అర్జున్‌రావు తెలిపారు. ఈ దాడులకు సంబంధించి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని తోటపేటలో నగల కోసం మహిళను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేశామని ద్రాక్షారామం ఎస్ఐ లక్ష్మణ్ విలేకరులకు తెలిపారు. తోటపేటకు చెందిన దామిశెట్టి మహాలక్ష్మి ఒంటరిగా నివసిస్తోంది. పక్కనే గల నాగిరెడ్డి అప్పారావు నగల కోసం ఈ నెల 12న ఆమెను గొంతు నిలిపి హత్య చేశాడు. మృతురాలి అల్లుడు సురేష్ ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు నిందితుని అరెస్టు చేశారు. అతడి వద్ద మహిళ బంగారు గొలుసు, ఉంగరం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అప్పారావును రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని వేగాయమ్మపేట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మతి చెందాడు. వెలంపాలెంకు చెందిన కోనపల్లి జ్యోతి బాబు (38) తన స్కూటర్‌పై ద్రాక్షారామం నుంచి యానాం వైపు వెళుతుండగా వేగాయమ్మపేట మలుపు వద్ద స్కూటర్ అదుపుతప్పి పక్కనే ఉన్న పంట బోదెలోనికి బోల్తా కొట్టింది. దీంతో జ్యోతి బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. జ్యోతిబాబుకు భార్య ఉంది. బంధువుల ఫిర్యాదు మేరకు ద్రాక్షారామం ఎస్ఐ లక్ష్మణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-రావులపాలెం

మండల పరిధిలోని రావులపాడు జాతీయ రహదారి సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం రావులపాడు వంతెన సమీపంలోని తుప్పల్లో సుమారు 35 ఏళ్ల వయసు గల వ్యక్తి మృతదేహం ఉన్నట్టు విఆర్ఒ ఫిర్యాదు చేయడంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు ఎరుపురంగు షర్టు, లేత గోధుమ రంగు కాటన్ ప్యాంటు ధరించి లారీ క్లీనర్, డ్రైవర్ అయి ఉండవచ్చన్నారు.

పంట కాలువలో మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-కాట్రేనికోన

బొబ్బర్లంక-పల్లంకుర్రు ప్రధాన పంట కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు. మృతదేహంపై ప్యాంటు మాత్రమే ఉందని, మృతుడి వయసు 35 ఏళు ఉంటుందని ఆయన తెలిపారు. ఎవరైనా అనుమానితులు ఉంటే కాట్రేనికోన పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్క్మి తెలిపారు.

చోరీపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని కొత్తూరు సెంటర్ చైతన్య సప్లయర్స్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడా కియోస్క్ ఉంది. శుక్రవారం రాత్రి చైతన్య సప్లయర్స్ తాళాలు పగలగొట్టి లోపల ఉన్న సొరుగుతో ఉన్న బల్లను అపహరించారు. ఈ బల్ల సొరుగులో వినియోగదారుల పత్రాలు ఉన్నాయని సప్లయర్స్ అధినేత తెలిపారు. ఈ అంశంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు



ఎగసి పడుతున్న మంటలు

ఎడిబి రోడ్డులో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఏడిబి రోడ్డు వాలు తిమ్మాపురం రహదారిని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఉన్న ప్లాస్టిక్, ధర్మకోల్‌కు సంబంధించిన సామాగ్రి అగ్ని ప్రమాదానికి గురైంది. సోమవారం సాయంత్రం జరిగిన ఈ అగ్ని ప్రమాదంలో మంటలు ఎగిసి పడటంతో రహదారిలో వెళ్లేవారు భయాందోళనకు గురయ్యారు. ఈ మంటలను ఆర్పేందుకు పెద్దాపురం, జగ్గంపేటలకు చెందిన మూడు అగ్నిమాపక వాహనాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. రాత్రి 9 గంటలకు కూడా మంటలు అదుపులోకి రాలేదు. పెద్దాపురం ఎస్ఐ వి మౌనిక సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు అగ్ని ప్రమాదానికి కారణమైన ఈ సామాగ్రికి సంబంధించి ఎవరూ రాలేదన్నారు ఈ స్థలం యజమానిని పిలిపించి విచారణ జరుపుతామన్నారు.

దాతల సహకారం అభినందనీయం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. 8వ వార్డ్ కౌన్సిలర్ పిల్లాడి సత్యవతి ఆధ్వర్యంలో దాతలు వేగి అప్పాజీ, కొడతల శివాజీ సహకారంతో ఆసుపత్రికి రూ.35 వేలు విలువ చేసే ఎసి యూనిట్‌ను వారు ఆసుపత్రి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గతంలో ఆసుపత్రి అభివృద్ధికి టిడిపి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. నూతన భవన నిర్మాణంతోపాటు ఆసుపత్రిలో సదుపాయాలు కల్పనకు చర్యలు చేపట్టుగా ప్రస్తుతం వందలాది మంది ప్రజలు ఆసుపత్రి సేవలను వినియోగించుకుంటున్నారన్నారు. వైద్య సిబ్బంది కూడా అవసరమైన మేరకు ఉండి ఉత్తమమైనటువంటి సేవలు ప్రజలకు అందిస్తున్నారని, రానున్న రోజుల్లో మరిన్ని సేవలు ప్రజలకు అందించే విధంగా ఆసుపత్రిని అభివృద్ధి చేస్తామన్నారు. దాతలు ఇంకా ముందుకు వచ్చి ఆసుపత్రి అవసరాలకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే



ఆసుపత్రికి ఎసి యూనిట్‌ను అందజేస్తున్న ఎంఎల్ఎ

జగదీష్ మోహన్, బలుసు వాసు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, నిమ్మకాయల కిరణ్‌కుమార్, మెండుం సరయ్య, ఎండి సైపుల్ల, ఎండి హబిబుల్లా, సరోజ వాసు, పిట్టా జానకి రామారావు, మంచెం సాయిబాబు, పలువురు కౌన్సిలర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక మెయిన్ రోడులో ప్రతివారం దాతల సహకారంతో నిర్వహించే అన్న క్యాంటీన్‌లో సోమవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ పాల్గొని భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి తెలుగువాడు ఆరాధించే నాయకుడు ఎన్‌టిఆర్ ఇచ్చిన ఆశయంతో సిఎం చంద్రబాబు నాయుడు రూ.5 రూపాయలకే అన్న క్యాంటీన్ ద్వారా భోజనం అందిస్తున్నారని అన్నారు. జగ్గంపేట



అన్నదానం చేస్తున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

నియోజకవర్గంలో గత మూడేళ్లుగా ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ఉచిత అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి దాతల సహకారం అందిస్తున్నారని అన్నారు. ఈ వారం కిర్లంపూడి మండలం ముక్కొల్లు గ్రామానికి చెందిన ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బస్వా వీరబాబు ఆర్థిక సాయంతో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బస్వా వీరబాబు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, తోట గాంధీ, జీను మణి బాబు, దేవరపల్లి మూర్తి, బూపాలపట్నం, ప్రసాద్ దాపర్తి సీతారామయ్య, వేములకొండ జోగారావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి స్టీఫెన్ ఆనంద్

ఘనంగా ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా నూతన సంవత్సర వేడుక కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెంలో సోమవారం ఘనంగా జరిగింది. కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ డాక్టర్ స్టీఫెన్ ఆనంద్ ఆధ్వర్యంలో అధ్యక్షులు జాన్ రిక్కీగూటం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది కాలంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఏడాది చేపట్టే ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలపై చర్చించి భవిష్యత్ ప్రణాళికను రూపొందించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బిషప్. జోసెఫ్ బెన్నీ, ఎఐసిసి రాష్ట్ర, కాకినాడ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో పాటు కార్యవర్గ సభ్యులు మరియు ఏడు రీజియన్లకు సంబంధించి ఎఐసిసి కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, పిఠాపురం, తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట తదితర ప్రాంతాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చొల్లంగి పర్యాటక కేంద్రం వద్ద శిక్షణా ఫారెస్టు రేంజ్ అధికారులు

తెలంగాణ అటవీ సిబ్బంది మడ అడవుల సందర్శన

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం కోరంగి అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రాన్ని హైదరాబాద్‌కి చెందిన శిక్షణ ఫారెస్ట్ రేంజ్ అధికారులు సోమవారం సందర్శించారు. హైదరాబాదు డిప్యూటీ జిల్లా అటవీ శాఖ అధికారి వికె షాహు ఆధ్వర్యంలో వచ్చిన 34 మంది బృందానికి కాకినాడ ఫారెస్ట్ రేంజర్ వరప్రసాదరావు మడఅడవుల ప్రాముఖ్యతను వివరించారు. ఇక్కడ సంచరించే పక్షులు, ఇతర జీవజాతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి కె.సిద్ధార్థ, బీట్ అధికారులు కె.మహేష్, జి.గోపినాగేంద్రకుమార్, ఎం.మధు, పి.సంధ్యా రాణి, సిహెచ్.ధనలక్ష్మి, సిబ్బంది పాల్గొ న్నారు.



కల్నల్ మానిక్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

చెస్‌తో మానసిక దృఢత్వం

ప్రజాశక్తి - పెద్దాపురం

చెస్ క్రీడతో విద్యార్థులు మానసిక దృఢత్వాన్ని పొందుతారని 3వ ఆంధ్ర బెటాలియన్ ఆఫీసర్ కల్నల్ హెచ్ఎస్.మానిక్ అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో నిర్వహిస్తున్న 13వ నేషనల్ స్కూల్స్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు, అడ్వైజర్ వైడి.రామారావు, సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ నరసింహన్, డాక్టర్ విజయ నరసింహన్, డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ వీరన్న చౌదరి మాట్లాడారు. చదరంగం క్రీడ నిరంతరం మెదడుకు పదును పెడుతుందన్నారు. విద్యార్థి దశ నుంచి ఈ క్రీడలో ప్రావీణ్యం సాధించటం వల్ల తెలివిగా ఆలోచిస్తారన్నారు. అనంతరం కల్నల్ మాణిక్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.



పురస్కారాన్ని అందుకుంటున్న శశికళ

శశికళకు సావిత్రీబాయి పూలే జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - కాకినాడ

సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకుని సదరన్ ప్రయివేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక సాంబమూర్తి నగర్ అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్ టీచర్ శశికళకు సావిత్రిబాయి పూలే జాతీయ పుస్కారాన్ని అందించారు. ఈ పురస్కారాన్ని ఎంఎల్‌సి కె.లక్ష్మణరావు చేతుల మీదుగా ఆమె అందుకున్నారు.

టిటిడిసిలో నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక టిటిడిసిలో నిరుద్యోగ యువతకు మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు డిఆర్‌డిఒ పీడీ కె.శ్రీరమణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, టీమ్ లీస్, డక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీల్లో 250 ఉద్యోగాలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని ఏలేశ్వరం, జగ్గంపేట, ప్రత్తిపాడు ప్రాంతాల్లో బ్రాంచి రిలేషన్షిప్ ఎగ్జిక్యూటివ్, బ్రాంచ్ రిలేషన్షిప్ మేనేజర్లు, ట్రైనీ కెమిస్ట్ ఉద్యోగాలకు ఇంటర్, డిగ్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బిజెడ్‌సి కెమిస్ట్రీ విద్యార్హత కలిగిన యువత అర్హులన్నారు. ఆసక్తి గల యువత మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు సామర్లకోటలోని టిటిడిసి శిక్షణ కేంద్రంలో స్వయంగా హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 9440756250, 9949156583 నంబర్లకు సంప్రదించాలని ఆమె కోరారు.



గంధోత్సవంలో పాల్గొన్న ఎంఎల్ఎ చినరాజప్ప

ఘనంగా ఉరుసు ఉత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

పాత పెద్దాపురం రహదారిలో హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా, షా రహమతుల్లా ఔలియా సమాధి వద్ద సోమవారం రాత్రి ఉరుష్ గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని సమాధిపై వస్త్రాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన ఉరుసు గంధోత్సవాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్, వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, దర్గా అధ్యక్షులు ఎండి లాయక్ అలీ, షేక్ బాబూలాల్, ఎండి ఆశిక్ అలీ, ఎస్ఎ రజాక్, సయ్యద్ కరీం జానీ, షేక్ గౌస్, రఫీ, షేక్ బాబ్జి, హెచ్ ఏ జలీల్, షబ్బీర్ హుస్సేన్, ఎండి రిజ్వాన్, ఇర్షాద్ అలీ, జాకీర్ హుస్సేన్, ఎండి ప్రకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ముదునూరి

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, వైసిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. సోమవారం మండలంలోని ధర్మవరం గ్రామంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో ఉన్న ప్రతిభను కనపరిచేందుకు కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. 55 కేజీల విభాగంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను తమ ట్రస్ట్ ద్వారా అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు జువ్వల బాబులు, నానీపల్లి చంటి, వైస్ సర్పంచ్ బొల్లు చిట్టిబాబు, నాయకులు ముదునూరి సీతారామరాజు, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రైతు నుంచి వివరాలు సేకరిస్తున్న తహశీల్దార్

ప్రభుత్వ భూముల గుర్తింపునకు సహకరించాలి

ప్రజాశక్తి - కాజులూరు

ప్రభుత్వ భూముల గుర్తింపులో రైతులు సహకరించాలని తహశీల్దార్ జి.రవీంద్రనాథ్‌ఠాగూర్ కోరారు. సోమవారం మండలంలోని కోలంక గ్రామంలో రీ సర్వేలో భాగంగా ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోలంక రెవెన్యూ పరిధిలో కోలంక, పెదలంక, నామవానిపాలెం గ్రామాలు ఉన్నాయని, వీటిలో సుమారు 330 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. ప్రారంభంలో ప్రభుత్వ భూమిని గుర్తించిన అనంతరం జిరాయితీ భూములను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో 11 సర్వే బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వేగేశ్వరరావు, మండల సర్వేయర్ సూర్యనారాయణమూర్తి, గ్రామ సచివాలయ సర్వేయర్లు కె.రాజు, సంధ్య, కరెడ్ల సత్యశుభ, దుర్గా, హరీష్, కాశీ విశ్వనాథ్, రైతులు పాల్గొన్నారు.

బచ్చు కుటుంబానికి పల్లంరాజు పరామర్శ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇటీవల మృతి చెందిన మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ బచ్చు శ్రీదేవి కుటుంబాన్ని కేంద్ర మాజీ మంత్రి ఎంఎం.పల్లంరాజు, కాంగ్రెస్ నాయకులు సోమవారం పరామర్శిం చారు. ఈ సందర్భంగా శ్రీదేవి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాదేపల్లి సత్యానందరావు, నాయకులు సుదర్శన్, తుమ్మల దొరబాబు, తోట కరుణాకర్ సోనీ పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పల్లంరాజు

సమస్యల పరిష్కారం కోరుతూ 7 అర్జీలు

ప్రజాశక్తి -:పెద్దాపురం

స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరుతూ ఏడుగురు అర్జీలను కార్యాలయ ఎఒ మాధవరావుకు అందజేశారు. ఈ అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించినట్లు మాధవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ జి.ఉష, హౌసింగ్ ఎఇ శ్రీనివాస్, డిటి భానుకుమార్, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యలో ఫిబ్రవరి 3న అక్షరాభ్యాసాలు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో వసంత పంచమి సందర్భంగా ఫిబ్రవరి 3వ తేదీన ప్రత్యేక పూజలు, సామూహిక అక్షరభ్యాస కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సామూహిక అక్షరాభ్యాసాలతోపాటు, ప్రసాద వితరణ జరుగుతుందని అన్నారు. కావున పరిసర గ్రామ ప్రజలు అందరు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మరిన్ని వివరాల కొరకు క్యాంపస్ ఇన్‌ఛార్జ్ పి.చక్రవర్తి ఫోన్ నెంబర్ 7731886664ను సంప్రదించాలని సూచించారు.

పలు చోట్ల అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు, పెద్దాపురం

మండలంలోని జార్జిపేట గ్రామంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. ఈ మహోత్సవాలకు ఆర్థిక సహకారం అందించిన గ్రామస్తులకు, దాతలకు కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. పెద్దాపురం వరహాలయ్య పేటలో సోమవారం శ్రీరామ నామ నగర సంకీర్తన బృందం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు ముసిడిపల్లి పుల్లారావు మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా పట్టణంలో నెల రోజులపాటు నగర సంకీర్తన నిర్వహిస్తున్నామన్నారు. ముగింపు సందర్భంగా అన్నదానం, పేదలకు వస్త్రదానం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముసిడిపల్లి నాగన్న, షేక్ సుభాని, ముసిడిపల్లి చిన్న, తాండ్రంగి స్వామి, రాజా, గణేష్, కుమార్ పాల్గొన్నారు.



డిజిపిని సత్కరిస్తున్న ఎంఎల్ఎ వనమాడి

డిజిపిని కలిసిన ఎంఎల్ఎ కొండబాబు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరానికి విచ్చేసిన రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావును స్థానిక పోలీస్ అతిథి గృహంలో ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు.



బాధితునికి సాయాన్ని అందిస్తున్న సర్పంచ్

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ములగపూడి గ్రామంలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులు నీలి చిన్నయ్య, పెదపాటి అర్జున్‌రావు, గణేష్ కుటుంబాలకు సర్పంచ్ తామరాల సత్యానారాయణ ఆర్థిక సాయం అందించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.2 వేలు, 10 కిలోల బియ్యం అందజేశారు. అలాగే ఎంపిటిసి సభ్యులు యామల సురేష్ ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యంను ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ నరేష్ చేతుల మీదగా అందజేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఆర్ఐ పట్నాయక్, విఆర్ఒ శ్రీను, పాల్గొన్నారు.